క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ఆమనగల్లు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో ముర్తుజపల్లి వాసి కాలె మహేందర్ మృతి చెందాడు. ఈ మేరకు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను అదే గ్రామానికి చెందిన ఫ్రెండ్స్‌యూత్ సభ్యులు పరామర్శించారు. అనంతరం రూ.25 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్‌యూత్ సభ్యులు సుభాష్, రాజు, అంబేద్కర్, స్వామి, యాదయ్య, బాలయ్య, కార్తీక్, సాయి, విక్రం, శ్రీకాంత్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు హైమాస్ట్ లైట్లను గురువారం రాత్రి మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మంజూరు చేసిన నిధులతో గ్రామంలోని బస్టాండ్, శ్రీ వేంకటేశ్వర దేవాలయం వద్ద లైట్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ

కడ్తాల్: ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుందని, భక్తి భావం పెంపొందుతుందని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల పరిధి కాన్గుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని అమ్మవారి ఆలయానికి రూ.21,116ల విరాళాన్ని ఆయన.. ఆలయ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు గోప్యానాయక్, శ్రీను, బాలు, రాజు, కిషన్ ఉన్నారు.

ధర్మాస్పత్రిలో సౌకర్యాలు కల్పించండి



మెడికల్ అధికారితో మాట్లాడుతున్న ఐద్వా నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎల్మినేడు ప్రభుత్వ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మంకాల విజయమ్మ కోరారు. శుక్రవారం మండల పరిధి ఎల్మినేడు ఆస్పత్రిని ఆమె పరిశీలించి మాట్లాడారు. తుర్కగూడ, ఎల్మినేడు, జబ్బార్‌గూడ, మాదాపురం, పోచారం గ్రామాల నుంచి ఇక్కడికి వైద్య చికిత్సకోసం వస్తుంటారని, రోగుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. అటెండర్, స్వీపర్‌ను నియమించాలన్నారు. ఆమెతో పాటు ఐద్వా మండల కార్యదర్శి దేవరకొండ ఇందిర ఉన్నారు.

'శాక్తేయ' రుసుము వసూలు హక్కులకు వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కడ్తాల్: మండల పరిధి మైసమ్మ ఆలయ ప్రాంగణంలో శాక్తేయ మొక్కు బడుల రసీదు రుసుము వసూలు హక్కులకు శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వేలంలో ఐదుగురు పోటీ పడగా.. మైసిగండి గ్రామానికి చెందిన రమావత్ రాజునాయక్ రూ.20.80 లక్షలకు (ఇరవై లక్షల ఎనభై వేలు) హక్కులను కై వసం చేసుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు మోహన్‌రావు, ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ శిరోలీ, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, ఉప ప్రధాన అర్చకులు యాదగిరి, సీనియర్ అసిస్టెంట్లు కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, ఎస్ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐ మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: నూతన సీఐ మహేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎన్ను గోవర్ధన్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త వీరబొమ్మ భాస్కర్‌లు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

ఊర్లో ఉన్నారా? లేరా?

- పల్లెల వైపు చూడని ప్రత్యేకాధికారులు
- అటకెక్కిన ప్రత్యేక పాలన!
- నిధులలేమితో కుంటుపడిన అభివృద్ధి
- అప్పుల్లో పంచాయతీ కార్యదర్శులు
- నిలిచిన బిల్లులు, పాస్ కాని చెక్కులు



యాచారం మండల పరిషత్ కార్యాలయం

పంచాయతీల్లో ప్రత్యేక పాలన పడకేసింది. గ్రామాల అభివృద్ధి, ప్రాంత ప్రజల సంక్షేమం గాలిలో దీపంలా మారింది. వెరసి పల్లెలు మసకబారిపోయాయి. స్థానిక పాలకుల గడువు ముగిసిన అనంతరం గ్రామాల్లో పరిపాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ.. వారు జీపీలను పట్టించుకోవడం లేదని, అసలు వారంటూ ఊర్లో ఉన్నారో.. లేదో తెలియదని ప్రజలు పేర్కొంటున్నారు.

యాచారం: గ్రామాల్లో ఏడాది క్రితం సర్పంచులు, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసింది. ఆ తరువాత స్థానిక ఎన్నికలను ప్రభుత్వం నిర్వహించకుండా.. ప్రత్యేక పాలన ఏర్పాటు చేసింది. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు అధికారులను నియమించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. పరిపాలనలో ఆ అధికారులు విఫలమయ్యారు. నిత్యం గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలు, గ్రామంలో మౌలిక సౌకర్యాలు తదితర వాటిని పర్యవేక్షించాల్సి ఉంటుంది. కానీ వారు ఏనాడు గ్రామాలకు రావటం లేదని, ఏదో చుట్టపు చూపుగా వచ్చివెళ్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలు ఆ సార్లు ఎవరో కూడా మాకు తెలియదని పేర్కొంటున్నారు.

నిధులు లేక.. పనులు చేపట్టక

ప్రత్యేక పాలనలో గ్రామాలను నిధులు లేమి వెంటాడుతోంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. ఏడాది కాలంగా పంచాయతీల్లో చెక్కులు పాస్ కావడం లేదు. మండల పరిధిలో రూ. కోటిన్నరకు పైగానే బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. మేజర్ గ్రామ పంచాయతీలైన యాచారం, మాల్, నందివనపర్తి, గునుగల్, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, చింతపట్లలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. వివిధ రకాల అభివృద్ధి పనులు, సిబ్బంది జీతాలతో పాటు ఇతర అత్యవసర సమయాల్లో ఖర్చు చేసినవి రూ. లక్షల నిధులు అందాల్సి ఉంది.

అప్పులతో తిప్పలు

గతేడాది సెప్టెంబర్ నుంచి బిల్లులు చేసి, ఎస్‌టీఓకు చెక్కులు పంపుతున్నా పాస్ కావడం లేదు. ఏదో పరిపాలన కోసం కార్యదర్శులు అప్పులు చేసి, ఖర్చు చేయడమే కానీ.. ఎస్‌టీఓలో చెక్కులు పాస్ కాక అప్పుల పాలై తిప్పలు పడాల్సిన దుస్థితి. ఇదిలా ఉండగా.. నిధుల లేమితో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. తద్వారా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొదిరోజుల క్రితం మంతన్‌గౌరెల్లి గ్రామంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించగా.. అక్కడి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడం, ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో.. పోతారో తెలియడం లేదని పేర్కొన్నారు.

అప్పు పుట్టడం లేదు



యాచారం, చౌదర్‌పల్లి గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. గత సెప్టెంబర్ నెల నుంచి బిల్లులు పంపడమే కాని, చెక్కులు పాస్ కావడం లేదు. అప్పు చేసి రెండు గ్రామాల్లో సమస్యలు తీరుస్తున్నాను. ఇప్పటి వరకు రూ. మూడున్నర లక్షలకు పైగా వెచ్చించాను. మరలా అప్పు పుట్టడం లేదు.

– తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

ప్రజాసంక్షేమం గాలిలో దీపం



స్థానిక పాలకులు లేరు. దీంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడంది. ప్రజా సమస్యలు గాలీలో దీపంలా మారింది. ప్రత్యేక పాలన అటకెక్కింది. ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తారో, వెళ్తారో తెలియదు. ప్రభుత్వం తక్షణమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలి.

– కొప్పు సుకన్య, మాజీ ఎంపీపీ, యాచారం

విధిగా గ్రామాలకు వెళ్లాలి



ప్రత్యేకాధికారులకు కేటాయించిన గ్రామాలకు వారు వారానికి నాలుగు సార్లు వెళ్లాలి. అత్యవసరం ఉంటే నిత్యం వెళ్లాలి. కానీ వారు పల్లెలకు వెళ్లడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. అలా ఉంటే కుదరదు. వెంటనే గ్రామాల్లో పర్యటించి, ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరించాలి. పెండింగ్ బిల్లుల మంజూరు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– మాధవరావు, మండల ప్రత్యేకాధికారి, యాచారం

మత్తువద్దు.. భవిష్యత్తు ముద్దు

- దురలవాట్లకు దూరంగా ఉండండి
- ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మత్తు పదార్థాలకు బానిస అయితే.. భవిష్యత్తు అంధకారం అవుతుందని, విద్యార్థి దశ నుంచే వాటికి దూరంగా ఉండాలని ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ సీఐ సీతారాంరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌లోని ఓ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ ఒక వ్యక్తిని మాత్రమే కాదని, ఒక కుటుంబాన్ని నాశనం చేస్తుందని తెలిపారు. దాని బారిన పడినవారిని సమాజం చీత్కరిస్తుందని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్తు కోసం డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టడానికి పెద్దలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్స్‌పాల్ రాధిక, ఎక్సైజ్ పోలీసులు గణేశ్, మోహన్, శివాని తదితరులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

యాచారం: యువత సన్మార్గంలో నడవాలని సీఐ నందీశ్వర్‌రెడ్డి సూచించారు. మత్తు పదార్థాలకు భానిసైతే.. భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. శుక్రవారం స్థానిక యువతతో సీఐ మాట్లాడారు. విద్యార్థి, యువత దశ ఎంతో కీలకమైందని, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, వాహనదారులు ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న సీఐ సీతారాంరెడ్డి



యాచారం: యువతతో మాట్లాడుతున్న సీఐ నందీశ్వర్‌రెడ్డి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడ్తాల్: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం చలో కమిషనరేట్ ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు కుమార్, నాయకులు అంజయ్య, చెన్నయ్యలను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. అధికారంలోకి వస్తే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారం చేపట్టి ఏడాదిన్నర అయినా వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెట్టడం సరికాదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోసం వెళ్తున్న వారిని అరెస్టు చేయడం తగదని, వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి బాటసింగారం ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు అబ్దుల్లాపూర్‌మెట్ టౌన్, బాటసింగారం, ఇనాంగూడ, జేఎస్ఎస్‌యు ఆర్ఎం కాలనీ, కార్తీక్ హోమ్స్, లష్కర్‌గూడ, యశోధానగర్ కాలనీ, బాచారం, అబ్దుల్లాపూర్, బీసీకాలనీ, గండిమైసమ్మదేవాలయం, ఔటర్ రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుందని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎనీ టైం.. మందు ఫుల్

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

- యథేచ్ఛగా కొనసాగుతున్న బెల్టు దుకాణాలు
- వీధులు, ప్రధానరోడ్లే అడ్డాలు

మీర్‌పేట: అక్రమ మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా బహిరంగ ప్రదేశాల్లో లభిస్తున్న మందుతో మద్యం ప్రియులు, యువత నిత్యం మత్తులో జోగుతోంది. దీనికి తోడు సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వ్యాపారులకు కలిసి వచ్చింది! ఇదే అదనుగా భావించిన కొందరు.. వీధులు, ప్రధాన రోడ్లుకు ఇరువైపులా చిన్నచిన్న దుకాణాలను ఏర్పాటు చేసి, లిక్కర్ దందా జోరు పెంచినట్లు సమాచారం.

తాగేవారికి తాగినంత

మీర్‌పేట కార్పొరేషన్ పరిధి లెనిన్‌నగర్, రైతుబజార్, జిల్లెలగూడ తదితర బస్తీలలో 24 గంటలు బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రి వేళలో వైన్‌షాపులు మూసివేసిన అనంతరం.. ఇవే ప్రత్యామ్నాయంగా మారడంతో తాగేవారికే కొరత లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. అయినప్పటికీ.. ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు.



అడ్డాగా రైతుబజార్..

లెనిన్‌నగర్ రైతుబజార్ కూడలి నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడే కూరగాయలు విక్రయిస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా బస్‌షెల్టర్ ఉంటుంది. ఇంత రద్దీగా ఉండే కూడలిలో ఇతర వ్యాపారం ముసుగులో కొందరు.. డబ్బాలు ఏర్పాటు చేసుకొని, బెల్టుషాపులకు అడ్డాగా మార్చేశారని స్థానికులు తెలిపారు. తెల్లవార్లు విక్రయిస్తుండటంతో.. యువత పెడదారి పడుతోందని వాపోతున్నారు. గతంలో మీర్‌పేట పోలీసులు దాడులు చేసి, హెచ్చరించినా నిర్వాహకుల్లో ఎలాంటి మార్పు రాలేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

- మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- దుకాణ సముదాయం ప్రారంభించిన ఎమ్మెల్యే



షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి చిత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు

ఆమనగల్లు: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, వ్యవసాయరంగం, మార్కెట్‌యార్డుల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో రూ.65 లక్షలతో నిర్మించిన దుకాణ సముదాయాన్ని శుక్రవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాటగీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు రుణ మాఫీ, సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రేషన్‌షాపుల ద్వారా ప్రజలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు.

రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు

ఆమనగల్లు మున్సిపాలిటీలో రూ.25 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, అందులో భాగంగా ఇప్పటికే రూ.10 కోట్లతో చేపట్టే పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వివరించారు. ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రూ.17.50 కోట్లతో నూతన భవనం నిర్మిస్తున్నామని, జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు పూర్తి చేసి, వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. ఈ ఏడాది వానాకాలంలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డిండీ కాల్వ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల మండలాల సాగునీరు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు పాండురంగయ్య, శ్రీశైలం, నరేశ్‌నాయక్, అంజయ్య, అజీం, రమేశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ఖాదర్ ఖాద్రి, మానయ్య, సీఐ జానకీరాంరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ రగడ

దుకాణ సముదాయం ప్రారంభానికి తనను ఆహ్వానించలేదని సింగిల్‌విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ ఆరోపించారు. ప్రొటోకాల్ పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌యార్డులోని షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రారంభించగా.. ప్రభుత్వ కార్యక్రమానికి తనను ఆహ్వానించకుండా అవమానించారని, శిలాఫలకంపై తన పేరు లేదంటూ శిలాఫలకం వద్ద ఆయన నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను ఎమ్మెల్యే కసిరెడ్డి.. పార్టీ కార్యక్రమాలుగా భావిస్తున్నారని విమర్శించారు. రైతులతో ఎన్నుకోబడిన తనను, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగానే అవమానించారని పేర్కొన్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ అధికారులతో పాటు జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. మునుముందు ఇలాంటివి చేస్తే.. అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షు డు పత్యానాయక్, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, నాయకులు రమేశ్‌నాయక్, వెంకటేశ్, సయ్యద్ ఖలీల్, శ్రీనునాయక్, సైదులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ తదితరులు

పీఎఫ్, ఈఎస్ఐపై అవగాహన

మీర్‌పేట: కార్మికులు ఉద్యోగ విరమణ అనంతరం ఆర్థిక భద్రత పొందడానికి భవిష్యనిధి(పీఎఫ్) ఒక పొదుపు పథకమని మీర్‌పేట కార్పొరేషన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బందికి భవిష్యనిధి, కార్మిక రాజ్య బీమా(ఈఎస్ఐ) నుంచి వచ్చే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. భవిష్యనిధి పథకం ద్వారా కార్మికులకు కొంత మొత్తంలో వడ్డీ కూడా లభిస్తుందని తెలిపారు. అదే విధంగా కార్మిక రాజ్య బీమా పథకం ద్వారా వైద్యపరమైన, ఇతర సామాజిక భద్రత కల్పించే పథకమని వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ నాగేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, కార్మికరాజ్య బీమా సంస్థ శాఖ మేనేజర్ రజినీకాంత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

పట్టు తప్పిందా.. ప్రాణాలు గోవిందా!



నందిగామ: ప్రైవేట్ ఆటోలు, వాహనదారుల డ్రైవర్లు కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. సంపాదనే ధ్యేయంగా కనీస నిబంధనలను నీరుగారుస్తూ సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. మండల కేంద్రమైన నందిగామలో శుక్రవారం సాయంత్రం ప్రమాదకరంగా సామర్థ్యానికి మించి ట్రాలీ ఆటోలో ప్రయాణికులు వెళ్తున్నారు. స్థానికంగా ఉండే పరిశ్రమల నుంచి వలస కూలీలను ఇలా ప్రమాదకరంగా తీసుకెళ్లడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి సామర్థ్యానికి మించి ప్రయాణికులు వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంచాల: మండల పరిధి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు నోముల, 11.30కి లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రారంభం, 12కు మంచాల, 1కి ఎల్లమ్మతండా, 1.30కి సత్తితండా, 2కు ఆంబోత్ తండా, 2.30 గంటలకు లోయపల్లిలో పర్యటించనున్నారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో రూ.171.50 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని వివరించారు. ఆయా కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక సహాయం

ఇబ్రహీంపట్నం: కండరాల బలహీనతతో (గిలియన్– బారే సింగ్రోమ్) బాధపడుతున్న బాలికకు బీఆర్ఎస్ యువజన విభాగం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కొని రాజు అండగా నిలిచారు. హర్షిత వైద్య ఖర్చుల నిమిత్తం.. శుక్రవారం చిన్నారి తండ్రి నర్సింహకు రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వీరేశ్, అశోక్‌కుమార్, జలేందర్, సతీష్‌నాయక్, కిశోర్, సాయికుమార్, శ్రావణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నూతన కమిటీ నియామకం

మహేశ్వరం: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితంగానే సాధ్యమైందని సమితి మండల ఇన్‌చార్జి ఐక్కని రవి మాదిగ అన్నారు. గురువారం రాత్రి మండల పరిధి పెండ్యాల గ్రామంలో సమితి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శాఖ అధ్యక్షుడిగా గణేశ్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా జి.సురేందర్, అధికార ప్రతినిధిగా వై.రవీందర్, కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా జంగయ్య, విద్యార్థి పరిషత్(ఎంఎస్ఎఫ్) గ్రామ శాఖ అధ్యక్షుడు విశ్వతేజ, ఉపాధ్యక్షుడు వై.శివకుమార్, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా నర్సింహ, ఉపాధ్యక్షుడిగా నర్సింగ్‌రావు, అధికార ప్రతినిధిగా నర్సింహ, కార్యదర్శిగా వై.ముత్యం, ఎంఈఎఫ్(మాదిగ ఉద్యోగుల సంఘం) అధ్యక్షుడిగా తొంట దర్శన్, ఉపాధ్యక్షుడిగా సురేష్, అధికార ప్రతినిధిగా టి.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గణేశ్, సీనియర్ నాయకులు సామయ్య, రవి, జగన్, దశరథ, సురేష్, జంగయ్య, శ్రీనివాస్, భాస్కర్ మాదిగలు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

చేవెళ్ల: రాష్ట్రంలో రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వమే వస్తుందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు మున్నూరు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈర్లపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఆకర్షితులు అవుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని చెప్పారు. భవిష్యత్తు బీజేపీదేనని గుర్తిస్తున్న నాయకులు, యువకులు పార్టీలోకి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, బంటిగౌడ్, సతీష్, పాండు, నిఖిల్, శివకుమార్, అక్షయ్‌గౌడ్, వేణు, శివ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ పార్టీలో చేరిన యువకులతో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386